క్లుప్తంగా

శాకంబరిగా పర్వతవర్ధిని అమ్మవారు



శాకంబరి అలంకరణలో అమ్మవారు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామలో బియ్యంపేట వద్ద ఉన్న శ్రీ పర్వత వర్ధిని సమేత సప్తకోటి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం అమ్మవారిని ఆకుకూరలు, కూరగాయలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో మహిళలు లలితా సహస్ర పారాయణ చేశారు. అనంతరం భక్తులకు దాతలు కావలి వెంకటస్వామినాయుడు, కారుమూరి భీమశంకర నాగసత్యనారాయణలు అన్న ప్రసాదం అందజేశారు.

నేడు మంత్రి పర్యటన

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నెలపర్తిపాడు గ్రామంలో సోమవారం ఉదయం జరగనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. అదే గ్రామంలో ఒకే ప్రాంగణంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను మంత్రి వేణు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలి

నేడు గ్రామాల్లో జగనన్న సురక్ష

కె.గంగవరం: మండల పరిధిలోని సుందరపల్లి, పామర్రు గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపు ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహిస్తామని, లబ్ధిదారులు ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు కావాలన్నా క్యాంపుల వద్ద దరఖాస్తు అందిస్తే ఒక్క రోజులోనే ఉచితంగా పత్రాలు అందిస్తామని తెలిపారు.

జెడ్ మేడపాడులో..

మండపేట: జెడ్ మేడపాడులో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగనున్నట్టు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్ తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం తొమ్మిది గంటలకు మొదలయ్యే కార్యక్రమంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు హాజరై లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తారన్నారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి జగనన్న సురక్ష గ్రామసభలను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి నాయకత్వంలోని బృందంలో డీటీ సీహెచ్ బాలాజీ సభ్యులుగా ఉంటారు. మరో బృందానికి తహసీల్దార్ కొమరం సూర్యారావు నాయకత్వం వహించబోతుండగా విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సాల్మన్‌రాజు, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వై.శ్రీనివాసరావు సభ్యులుగా ఉంటారని తెలిపారు. 17న నల్లూరు, 18న కపిలేశ్వరపురం-1, 19న మాచర, 20న తాతపూడి, 21న కోరుమిల్లి-2, 22న వల్లూరు, 24న కపిలేశ్వరపురం-2, 25న అద్దంకివారిలంక, 26న కేదారిలంకలో గ్రామ సభలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ, తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా అశిరాంబ అమ్మవారి జాతర

కపిలేశ్వరపురం: అంగర గ్రామ దేవత శ్రీ అశిరాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహక కమిటీ నాయకులు రాగం రామచంద్రరావు పర్యవేక్షణలో జాతర సాగింది. గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారి ఆలయం వద్ద కాగడాలను వెలిగించి మొక్కులను తీర్చుకున్నారు.

ఈ-కేవైసీ చేస్తేనే.. డబ్బులొచ్చేది!

- ఆధార్‌తో అనుసంధానానికి ఈ నెల 31 తుది గడువు
- పూర్తి చేసుకుంటే 38,817 మంది రైతులకు లబ్ధి



వరినాట్లు వేస్తున్న కూలీలు

రాయవరం: రైతులకు చేయూత ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని అమలు చేస్తోంది. ఏటా జనవరి, మే, అక్టోబరు మాసాల్లో మూడు విడతలుగా రూ.2వేలు వంతున మొత్తం రూ.6వేలు పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. అయితే రైతు బ్యాంకు ఖాతాలకు ఈ-కేవైసీ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు ఈ నెలాఖరు లోపు గడువు విధించింది. దీంతో రైతులు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు రైతులను కోరుతున్నారు. క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల్లో 38,817 మంది రైతులు పీఎం కిసాన్ పథకానికి అర్హులు. ఈ నెల 14వ తేదీకి 82 శాతం మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకున్నారు. ఇంకా సుమారుగా 18 శాతం మంది చేయించుకోవాల్సి ఉంది. మీ సేవ కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో బయోమెట్రిక్ విధానం ద్వారా, రైతు భరోసా కేంద్రాల్లో ఓటీపీ ద్వారా ఈకేవైసీ చేయించుకునే వెసులుబాటు ఉంది. మిగిలిన రైతులు కూడా గడువులోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఈ-కేవైసీ చేయించుకున్న రైతుల వివరాలు

మండలం	టార్గెట్	చేసినవి	చేయాల్సినవి
రాయవరం	5,607	4,849	758
మండపేట	7,617	5,298	2,319
కపిలేశ్వరపురం	8,584	7,380	1,204
రామచంద్రపురం	8,275	6,904	1,371
కె.గంగవరం	8,734	7,416	1,318
మొత్తం	38,817	31,847	6,970

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్రంలో రైతులు ఎక్కడ ఉన్నా బయోమెట్రిక్ వేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. గడువులోగా ఈ-కేవైసీ చేయించుకోకపోతే పీఎం కిసాన్ లబ్ధి పూర్తిగా నిలిపివేస్తారు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

వారి సేవలు అనంతం

వలంటీర్లకు వందనం



లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనంతలక్ష్మి

కరోనా సమయంలో వలంటీర్ల సేవలు అనంతం. మహమ్మారికి జడిసి ఇంటిలోంచి బయటకు రావాలంటే భయపడే సమయంలో కోవిడ్ బాధితులకు బాసటగా నిలిచారు మండపేట గొల్లపుంత కాలనీకి చెందిన వలంటీర్ పిల్లి అనంతలక్ష్మి. కాలనీలోని తన 21వ క్లస్టర్ పరిధిలో 20కు పైగా కుటుంబాలు కోవిడ్ బారిన పడ్డాయి. వారికి ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులతో పాటు మందులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసేవారు. దగ్గరుండి రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు చేయించేవారు. కరోనా నుంచి వారు కోలుకునేంత వరకు అవసరమైన సేవలు అందించి, అండగా నిలిచారు. కోవిడ్ బాధితులకు సేవలందించే క్రమంలో ఆమె కూడా మహమ్మారి బారిన పడి తీవ్ర ఇబ్బందిపడి కోలుకున్నారు. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి తిరిగి వచ్చిన పలువురికి రేషన్ కార్డులు ఇప్పించారు. తన క్లస్టర్ పరిధిలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరవేస్తూ అండగా నిలిచారు.

– మండపేట

కష్ట కాలంలో ఇంటికొచ్చి..



కరోనా సమయంలో తెలిసిన వాళ్లే దగ్గరికి రావడానికి భయపడే రోజుల్లో మా వలంటీర్ అనంతలక్ష్మి వచ్చి వేలిముద్ర వేయించుకుని పింఛను అందజేశారు. ప్రభుత్వ పరంగా అన్ని పథకాలు మాకు అందజేస్తున్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేనివి.

– చిక్కాల శ్రీనివాసమల్లిక్, గొల్లపుంత కాలనీ, మండపేట,

వ్యవసాయంలో నవోదయం

- ఆర్బీకేల ద్వారా గ్రామాల్లో సేవలు
- రైతులకు ఆర్థిక సాయం
- ఆనందంలో అన్నదాత



నిర్మాణం పూర్తి చేసుకున్న అద్దంపల్లి రైతు భరోసా కేంద్రం



కె.గంగవరంలో సబ్సిడీపై పవర్ టిల్లర్లను రైతులకు అందిస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: వ్యవసాయం దండగ కాదు పండగ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. గ్రామాల్లో వ్యవసాయ విప్లవం తీసుకువచ్చారు. రైతుల కోసం అనేక పథకాలు అమలు చేసి, దేశం యావత్తూ రాష్ట్రం వైపు చూసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు కావాల్సిన సహాయాన్ని ఊరులోనే పొందేలా ఏర్పాటు చేశారు. రైతులకు పెట్టుబడి సాయం అందించడంతోపాటు విత్తనాలు మొదలుకుని పంట అమ్మకాల వరకూ రైతులే చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా కె.గంగవరం మండలంలో గత నాలుగేళ్లగా మొత్తం 43150 మంది రైతులకు గాను రూ.49.93 కోట్లు, యంత్ర సేవా పథకం ద్వారా 197 మంది రైతులకు గాను రూ.1.95 లక్షలు, పంట నష్ట పరిహారం కింద 20053 మంది రైతులకు గాను రూ.15 కోట్లు అందించారు.

గ్రామ స్థాయిలోనే సేవలు

ప్రస్తుతం రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామ స్థాయిలోనే అవసరమైన సేవలన్నీ వచ్చే చేరాయి. కె.గంగవరం మండలంలో మొత్తం 26 గ్రామాలకు గాను 20 ఆర్‌బీకేలు ఉన్నాయి. వీటిలో ఆరు చోట్ల నిర్మాణాలు పూర్తికాగా మిగిలిన భవనాలు పలు దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుతం ఆర్‌బీకేల్లో రైతులకు విత్తనం అందించడంతో మొదలు పెట్టి పంట కొనుగలు చేసే వరకు వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటున్నారు. సాగులో సూచనలు, సలహాలు అందించడంతో పాటు పొలంబడి వంటి కార్యక్రమాలు అందించి రైతులకు మేలు చేస్తున్నారు.

ఆర్థిక సాయం



ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ గత నాలుగేళ్లుగా వ్యవసాయం కోసం ఆర్థిక సాయం అందించారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే రైతుల ఖాతాలో రైతు భరోసా సొమ్ము జమ చేశారు. దీంతో పాటు పంట బీమా అందించడం, సబ్సిడీపై యంత్రాలు అందించడం, ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నారు.

– బత్తుల అప్పారావు, రైతు, కుందూరు

యంత్రాలతో రైతులకు మేలు



గత ప్రభుత్వం వ్యవసాయాన్ని పట్టించుకోలేదు. సీఎం జగన్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. గ్రామాల్లో రైతులు గ్రూపులుగా ఏర్పడి సబ్సిడీపై యంత్రాలు అందించారు. వాటి ద్వారా వ్యవసాయ పనులు సులభంగా చేసుకుంటున్నాం. ప్రస్తుతం నూతన టెక్నాలజీని రైతులకు అందించడానికి డ్రోన్ స్ప్రేయిర్లు కూడా అందిస్తున్నారు.

– ఇళ్లా సూర్యనారాయణ, రైతు, శివల

అన్ని విధాలా అండగా..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకోవడానికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట అమ్మకం జరిపే వరకూ రైతులకు వ్యవసాయ సిబ్బంది అండగా ఉంచారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సాయం అందిస్తున్నారు.

– బలుసు రవి, మండల వ్యవసాయాధికారి కె.గంగవరం

సామాజిక న్యాయంలో సువర్ణ అధ్యాయం

మండపేట: దళిత రైతులకు వారి భూములపై సంపూర్ణ హక్కుల కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని సామాజిక న్యాయంలో సువర్ణ అధ్యాయం లిఖించారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ సర్పంచుల సమాఖ్య కో కన్వీనర్, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. మండలంలోని ఏడిదలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. భూమిలేని దళిత రైతులకు జీవనోపాధి కోసం రాష్ట్ర ఎస్సీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ గతంలో భూములు కొనుగోలు చేసి అర్హులకు అందజేసిందన్నారు. లబ్ధిదారులకు భూమి విలువలో కొంత మొత్తాన్ని కార్పొరేషన్ రుణంగా ఇచ్చి దాన్ని తీర్చే వరకూ భూమిని తనఖా పెట్టుకుందన్నారు. కొందరు రైతులు రుణం చెల్లించి తనఖా నుంచి విడిపించుకోగా చాలా మంది రైతులు రుణం చెల్లించలేక తనఖా నుంచి విడిపించుకోలేకపోయారన్నారు. రుణాలు మాఫీ చేసి భూములపై తమకు సంపూర్ణ హక్కులు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా రైతులు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సీఎం జగన్ దళిత రైతుల రుణాలను మాఫీ చేసి వారికి సంపూర్ణ హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది దళిత రైతులకు ఎంతో మేలు చేశారని కొనియాడారు.

సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



స్వామి వారికి నిర్వహిస్తున్న అభిషేకాలు

రాయవరం: వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని లక్షపత్రి పూజ చేశారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. వద్దాది బాలగంగాధరతిలక్, నెక్కంటి గోపాలకృష్ణమూర్తి, కేవీ జోగన్న, ఏవీఆర్‌కే శాస్త్రి, టి.రాఘవరాజు, డి.రాము తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

ఉప్పొంగుతున్న గోదావరి



కపిలేశ్వరపురం వద్ద ఉప్పొంగుతున్న గోదావరి

కపిలేశ్వరపురం: గోదావరి ఉప్పొంగుతోంది. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని అద్దంకివారిలంక, పల్లపులంక, కేదారిలంక, నారాయణలంక, వీధివారిలంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి తీవ్రత పెరిగితే ఆయా గ్రామాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. లంక గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. వరద పెరిగితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు తహసీల్దార్ కొమరం సూర్యారావు తెలిపారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

కపిలేశ్వరపురం: ఇటీవల మృతి చెందిన వాకతిప్ప గ్రామానికి చెందిన పులిదిండి నాయుడు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట న్యాయవాది అల్లూరు రామకృష్ణ చౌదరి ఉన్నారు.

దీర్ఘకాలం నాటి సమస్యకు పరిష్కారం



కేశవరంలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న వెంకన్నబాబు తదితరులు

మండపేట: కేశవరం ప్రజలను దీర్ఘకాలంగా పట్టిపీడిస్తున్న ఆంజనేయస్వామి గుడి రోడ్డు సమస్యకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో పరిష్కారం లభించిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు తెలిపారు. రూ.16 లక్షలతో జరుగుతున్న ఆంజనేయ స్వామి గుడి రోడ్డు అభివృద్ధి పనులను ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు పెద్ద పెద్ద గోతులు పడి రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. సమస్యను ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోటకు వెంకన్నబాబు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు, పార్టీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, అద్దంకి రమణ, రాయపాటి సత్యనారాయణ, నున్న రాంబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వంశీ పాల్గొన్నారు.

పగలే వెలుగులు



ఆర్యావటం బ్రహ్మంగారి మఠం సెంటర్‌లో పగలే వెలుగులు చిమ్ముతున్న వీధిలైట్లు

కాజులూరు: విద్యుత్‌ను అవసరాన్ని మించి వినియోగించడం వల్ల అధిక వ్యయాలకు గురికావడమే కాకుండా విద్యుత్ కొరత ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ విషయంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అధికారులే విద్యుత్ దుర్వినియోగానికి పాల్పడుతుండడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్యావటంలోని కాకినాడ, కోటిపల్లి ప్రధాన రహదారిలో వీధిలైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. ఈ విషయంపై పలు మార్లు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైస్తవులపై దాడులు దారుణం



యునైటెడ్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆఫ్ రామచంద్రపురం సభ్యులు

రామచంద్రపురం: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు దారుణమని యునైటెడ్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆఫ్ రామచంద్రపురం సభ్యులు ఆదివారం ఖండించారు. పట్టణంలోని బెరాకా క్రైస్ట్ చర్చి ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని మతాలకు, అన్ని కులాలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అందించే దేశంలో ఒక మతాన్ని హింసించే సంఘటలు జరగడం శోచనీయమన్నారు. అక్కడి ప్రజలు సహనంతో ఉండాలని అక్కడ శాంతి నెలకొనాలని ప్రార్థన చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా ఉపాధ్యక్షుడు రెవరెండ్ ఆర్‌పీ జాషువా, అడ్వైజర్ రెవరెండ్ వి. జాన్‌బెన్నీ, మండల అధ్యక్షుడు రెవరెండ్ ఎం. జీవన్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు రెవరెండ్ వి. స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే ట్రాఫిక్ నిబంధనలు



గొల్లపాలెంలో వాహనదారులను పరీక్షిస్తున్న పోలీసులు

కాజులూరు: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గొల్లపాలెం పోలీసుస్టేషన్ ఏఎస్సై డేవిడ్ అన్నారు. ఆదివారం రాత్రి గ్రామంలోని కాకినాడ, కోటిపల్లి రహదారిపై ఏఎస్సై డేవిడ్, స్టేషన్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని పలు లారీలు, వ్యాన్లు, కార్లు, మోటారుసైకిళ్ల తదితర వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. పోలీసుస్టేషన్ సిబ్బంది సత్తిబాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు



ప్రమాదాలకు నిలయంగా ఉన్న మలుపు

కె.గంగవరం: తామరపల్లి గ్రామ ప్రారంభంలోని మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికులు అదుపు తప్పి పక్కనే ఉన్న చెరువు పడిపోవడంతో గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇసుక లారీలు మలుపుల వద్ద కూడా స్పీడ్ తగ్గించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, స్పీడు బేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటీపీ అడిగితే చెప్పవద్దు

బిక్కవోలు: మీకు అమ్మఒడి వచ్చిందని, రైతు భరోసా డబ్బులు పడ్డాయనీ.. ఇంకా విద్యాదీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ వంటి పథకాల పేర్లు చెప్పి కొందరు వ్యక్తులు ఫోన్లు చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దని బిక్కవోలు ఎస్సై పి.బుజ్జిబాబు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పేర్లతో కొంత మంది సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పథకాల పేర్లతో ఫోన్లు చేసి ఓటీపీలు అడిగి వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు కాజేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ఫోన్లపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల గురించి అధికారులు ఎప్పుడూ ఫోన్లు చేయరని, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డులు, ఓటీపీలను గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

పేకాట శిబిరంపై దాడి

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో జరుగుతున్న పేకాట శిబిరంపై దాడి చేసి, ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. కానేటి దుర్గయ్య, గుర్రాల శ్రీను, ఇజ్జిన బంగారు బాబ్జీ, గుర్రాల ప్రసాద్, కానేటి దుర్గాప్రసాద్, ధనకొండ దుర్గయ్యను అరెస్టు చేసి, వారి నుంచి రూ.4,730 స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రంగాపురంలో అక్రమంగా మద్యం కలిగిన పలివెల దుర్గ ప్రసాద్‌ను అరెస్టు చేసి, రూ.3,100 విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.